క్లుప్తంగా

ఇంటర్ ఫలితాల్లో శశి విద్యార్థుల ప్రతిభ



విద్యార్థి నాగరాజన్‌ను అభినందిస్తున్న శశి విద్యా సంస్థల వైస్ చైర్మన్ నరేంద్ర కృష్ణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాల్లో నగరంలోని శశి ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్ ఏలూరు క్యాంపస్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు గొట్టాపు నాగరాజన్ 990, కొసరాజు స్వరూప్ 985 అత్యధిక మార్కులు సాధించారని, మొదటి సంవత్సరం విద్యార్థులు సన్నికంటి సారా 457, పుసునూరి శైలు, అన్నమదాసు శ్యామ్ సాయి తేజ 454 అత్యధిక మార్కులు సాధించారు. ఈ సందర్భంగా శశి కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కేఎస్ఎస్ మాధవ్, ఇన్‌చార్జి సీహెచ్ ఉమా గోవిందరావు, అధ్యాపక బృందం తల్లిదండ్రులకు, విద్యార్థులకు సన్మానం చేసి పుష్పగుచ్ఛాలతో అభినందించారు. అత్యుత్తమ మార్కులు సాధించిన నాగరాజన్‌కు యాజమాన్యం తరపున శశి విద్యాసంస్థల వైస్ చైర్మన్ మేక నరేంద్ర కృష్ణ శుభాకాంక్షలు తెలిపారు.

30న ఎన్‌హెచ్ఎం జేఏసీ రాష్ట్ర కమిటీ సమావేశం

ఏలూరు టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా జాతీయ హెల్త్ మిషన్‌లో ఆయా విభాగాల్లో పనిచేస్తోన్న కంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై ఈనెల 30న రాష్ట్ర కమిటీ సమావేశం విజయవాడలో నిర్వహిస్తామని జేఏసీ రాష్ట్ర చైర్మన్ డి.దయామణి గురువారం ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత పరిస్థితులు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. ఎన్‌హెచ్ఎంలో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానంలో సుమారు 20 వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం 11వ పీఆర్‌సీ మేరకు గతేడాది నుంచి రెగ్యులర్ ఉద్యోగులతోపాటు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీఓ 5, 7 మేరకు వేతనాలు పెంపు అమలు చేస్తున్నారని, అప్పటి నుంచే ఎన్‌హెచ్ఎం ఉద్యోగులకు వేతనాలు పెంపు అమలు చేయాలని కోరారు. వైద్యారోగ్యశాఖ ఉన్నతస్థాయి అధికారులు ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో చర్చలు జరిపి వేతనాల పెంపు, ఇతర సౌకర్యాలు కల్పిస్తామని అంగీకరించినా నేటికీ వేతనాలు పెంపు ఉత్తర్వులు వెలువడ లేదని తెలిపారు. ప్రభుత్వం వెంటనే తమ సమస్యలపై సానుకూలంగా స్పందించాలని కోరారు.

పేదల చదువులకు ప్రభుత్వ భరోసా

- ఉన్నత చదువులకు వసతి దీవెన
- ఏలూరు నియోజకవర్గంలో
- 2,840 మందికి రూ.2.76 కోట్ల లబ్ధి



జగనన్న వసతి దీవెన కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు (ఫైల్)

ఏలూరు (టూటౌన్): విద్యారంగంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన విప్లవాత్మక మార్పులు ఫలితాలనిస్తున్నాయి. దేశంలో ఎక్కడా లేనివిధంగా అర్హులైన విద్యార్థులందరికీ విద్యాదీవెన పథకం ద్వారా పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ అందిస్తోన్న జగనన్న, వసతి దీవెన ద్వారా పేద విద్యార్థుల చదువులకు భరోసాగా నిలుస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం వసతి దీవెన నిధులను సీఎం వైఎస్ జగన్ విద్యార్థుల తల్లు ఖాతాలకు నేరుగా జమ చేశారు. ఏలూరు నియోజక వర్గ పరిధిలోని 2,840 మంది విద్యార్థులకు సంబంధించి 2,558 మంది తల్లుల బ్యాంకు ఖాతాలకు రూ.2.76 కోట్లు అందజేశారు. ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు చదివే పేద విద్యార్థులకు కాలేజీ ఫీజులను పూర్తిగా చెల్లిస్తున్న ప్రభుత్వం వారికి ఆహారం, హాస్టల్స్‌కయ్యే ఖర్చులకు కోర్సును బట్టి రూ.10 వేల నుంచి రూ.20 వేలు వరకు రెండు విడతలుగా చెల్లిస్తోంది. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బుధవారం తొలివిడత వసతి దీవెన సొమ్ము విడుదల చేసింది. దీంతో ఆర్థిక స్తోమత లేక చదువుకు దూరంగా ఉండాల్సి వస్తుందనే భయాందోళనల్లో ఉన్న విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ముఖాల్లో సంతోషాలను కురిపించేలా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయి.

2,840 మంది విద్యార్థులకు రూ.2.76 కోట్ల లబ్ధి

జగనన్న వసతి దీవెన పథకంలో ఏలూరు నియోజకవర్గంలోని 2,840 మంది విద్యార్థులకు రూ.2.76 కోట్లు మేరకు లబ్ధి చేకూరింది. ఎస్సీలు 330 మందికి రూ.32 లక్షలు, ఎస్టీలు 7 మందికి రూ.లక్ష, బీసీలు 1,817 మందికి రూ.1.76 కోట్లు, ఈబీసీలు 244 మందికి రూ.24 లక్షలు, ముస్లిం మైనార్టీలు 191 మందికి రూ.19 లక్షలు, కాపులు 234 మందికి రూ.23 లక్షలు, క్రిస్టియన్ మైనార్టీలు 17 మందికి రూ.2 లక్షలు చొప్పున లబ్ధి చేకూరింది.

నాలుగేళ్లలో రూ.12.87 కోట్ల లబ్ధి

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఇప్పటి వరకు నాలుగేళ్లల్లో జగనన్న వసతి దీవెన పథకంలో నియోజకవర్గంలోని విద్యార్థులకు రూ.12.86 కోట్ల మేరకు లబ్ధి చేకూరింది. దీంతో సీఎం జగన్ చల్లంగా ఉండాలంటూ విద్యార్థుల తల్లిదండ్రులు తమ దీవెనలు ఇస్తున్నారు.

నాలుగేళ్లలో జగనన్న వసతి దీవెన లబ్ధి ఇలా..

సంవత్సరం	విద్యార్థుల సంఖ్య	తల్లుల ఖాతాల సంఖ్య	అందించిన మొత్తం
2019-20	3,663	3,341	రూ.3.55 కోట్లు
2020-21	3,465	3,396	రూ.3.36 కోట్లు
2021-22	3,389	3,245	రూ.3.19 కోట్లు
2022-23	2,840	2,559	రూ.2.76 కోట్లు
మొత్తం			రూ.12.86 కోట్లు

విద్యార్థులకు వరం



ప్రభుత్వం అమలు చేస్తోన్న జగన్న విద్యా దీవెన, వసతి దీవెన పథకాలు మా విద్యార్థులకు ఒక వరంగా ఉన్నాయి. ముఖ్యమంత్రి ప్రవేశ పెట్టిన ఈ పథకాలు మాలాంటి వారి ఉన్నత చదువులకు ఎంతగానో ఉపయోగ పడుతున్నాయి. నాలాంటి పేద విద్యార్థులు ఈ పథకాల వల్లే ఉన్నత చదువులు చదవ గలుగుతున్నాం.

– కె.లక్ష్మి శిరీషా, బీకాం ద్వితీయ సంవత్సరం, ఏలూరు

విద్యతోనే ఉన్నతి



విద్యద్వారానే యువతకు ఉన్నత జీవితం అందుతుందనే పెద్దల మాటలు అక్షర సత్యాలు. వాటిని నిజం చేసుకునేందుకు జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన పథకాలు ఎంతగానో దోహద పడుతున్నాయి. మా ఉన్నత చదువులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్న ఒక భరోసా కల్పించారు. ముఖ్యమంత్రి చేసిన మేలు ఎన్నటికీ మరువలేము.

– జి.ప్రియాంక, బీటెక్, ద్వితీయ సంవత్సరం, ఏలూరు

చదువులకు భరోసా



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్న పేద విద్యార్థులకు పూర్తి భరోసా కల్పించడం ఎంతో ఆనందంగా ఉంది. చదువులకు ఫీజును పూర్తి రీయింబర్స్‌మెంట్ చేస్తున్న ప్రభుత్వం వసతి దీవెన పథకంలో మాకు అయ్యే ఖర్చులను అందించడం ఎంతో సంతోషంగా ఉంది.

– కె.బాలముకుంద, బీబీఏ, ద్వితీయ సంవత్సరం, సానిగూడెం, దెందులూరు మండలం

తల్లిదండ్రులపై భారం లేదు



ప్రభుత్వం విద్యార్థుల ఉన్నత చదువులకు ఇతోధికంగా సహకారం అందిస్తుండటంతో మా తల్లిదండ్రులపై భారం పడకుండా ప్రభుత్వం చేయడం గొప్ప విషయం. దీంతో మా లక్ష్యాలను చేరుకునేందుకు ఎంతో దోహద పడుతుంది. ఇంతటి మహోపకారం చేస్తున్న జగన్ అన్నకు ధన్యవాదాలు.

– ఎస్.రమ్య, డిగ్రీ మొదటి సంవత్సరం, చింతలపూడి

ఘనంగా భగీరథ జయంతి



భగీరథ విగ్రహం వద్ద పూజల్లో పాల్గొన్న సగర సంక్షేమ సంఘం ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక 23వ డివిజన్ ఫిరంగుల దిబ్బ శ్రీ దాసాంజనేయ స్వామి ఆలయం వద్ద ఉన్న భగీరథ మహర్షి విగ్రహం వద్ద భగీరథ జయంతి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత భగీరథ మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సగర సంక్షేమ సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ తన కఠోర తపస్సుతో గంగాదేవిని దివి నుంచి భువికి తీసుకు వచ్చిన మహోన్నత మహర్షి భగీరథుడు తమ సగర వంశ మూలపురుషుడేనని తెలిపారు. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎంతో వెనుకబడి ఉన్న తమ సామాజికవర్గాన్ని రాష్ట్ర ప్రభుత్వం బీసీ–డీ నుంచి బీసీ–ఏ గ్రూపులోకి మార్చి డీఎన్‌టీ జాబితాలోకి చేర్చేందుకు కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని కోరారు. తమ కులాన్ని సినిమాల్లో, వివిధ సామాజిక మాధ్యమాల్లో హేళన చేస్తూ మాట్లాడుతున్నారని అటువంటి వారిపై ఐపీసీ సెక్షన్ 1860 ప్రకారం చర్యలు తీసుకుని శిక్షలు వేసి సగరుల మనోభావాన్ని కాపాడాలని కోరారు. భగీరథ జయంతి రోజును ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కలవకొల్లు సాంబ, సగర సంక్షేమ సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షుడు గుళ్ళపల్లి నాగేశ్వర రావు, ఉపాధ్యక్షుడు కుప్పాల ఆంజనేయులు, జిల్లా యువజన అధ్యక్షుడు ఇబ్బా నాగేశ్వర రావు, సగర న్యాయవాదుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గండికోట సీతారామరాజు, కగ్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక దినంగా మేడే

ఏలూరు (టూటౌన్): ప్రపంచ కార్మిక దినోత్సవం 137వ మేడేను జిల్లాలోని ఏఐటీయూసీ అనుబంధ కార్మిక సంఘాలు కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక దినంగా నిర్వహించాలని ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. కేంద్రంలో 2014 నుంచి బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎన్నో ఉద్యమాలు, పోరాటాల ద్వారా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కార్మిక కోడ్లుగా మార్చి కార్మికవర్గానికి అన్యాయం చేసిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్ని ప్రైవేటీకరిస్తూ దేశాన్ని నష్టపరుస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఉద్యోగ అవకాశాలు లేకుండా చేస్తూ సామాజిక న్యాయానికి తూట్లు పొడుస్తోందని విమర్శించారు. పట్టణాల్లో మండల కేంద్రాల్లో సీపీఐ శ్రేణులతో కలిసి మేడే ఉత్సవాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.

ఉపాధి కూలీలకు పని కల్పించండి

ఏలూరు రూరల్: ఉపాధి హామీ పథకం కూలీలకు పని కల్పించాలని కోమటిలంక సర్పంచ్ తెనాలి యోహాన్ కోరారు. గురువారం ఆయన ఏలూరు మండలపరిషత్ అధ్యక్షుడు పెన్మత్స శ్రీనివాసరాజును కలిశారు. గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ నియామకం చేపట్టకపోవడం వల్ల కూలీలకు పని కల్పించే నాధుడే లేడని యోహాన్ తెలిపారు. జంగిల్ క్లీన్, పూడికతీత పనులు నిలిచిపోయాయని చెప్పారు. కొద్దిరోజులు వలంటీర్ల ద్వారా పని కల్పించినప్పటికీ స్థానికులు సహకరించడం లేదన్నారు. దీనిపై స్పందించిన శ్రీనివాసరాజు ఏపీఓ కిషోర్‌కు ఫోన్ చేసి తన చాంబర్‌కు పిలిచారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి సూచనల మేరకు ఫీల్డ్ అసిస్టెంట్‌ని నియమయాకం చేపట్టేలోగా ఇతర ఫీల్డ్ అసిస్టెంట్ ద్వారా కూలీలకు పని కల్పించాలని ఆదేశించారు.

డీఈఓకు ఏపీటీయూ నాయకుల అభినందన

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : జిల్లాలో 10వ తరగతి పరీక్షలను అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా విజయవంతంగా పూర్తి చేయడంలో కీలకంగా వ్యవహరించిన జిల్లా విద్యాశాఖాధికారి ఎన్వీ రవిసాగర్‌ను ఏపీ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి థామస్, ఎన్.ఆస్కార్, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.వి జయకుమార్ ప్రత్యేకంగా అభినందించారు. 10వ తరగతి జవాబు పత్రాల మూల్యాంకనంలో ఎన్నో ఒత్తిళ్లు ఎదురైనప్పటికీ వాటిని సవ్యంగా పరిష్కరించుకుని సకాలంలో పూర్తి చేయడానికి ఆయన చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు.

ఉద్యోగుల భవిష్యనిధిపై అవగాహన

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ ఏలూరు కార్యాలయంలో గురువారం ఆప్‌కే నికట్ 2.0 కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి అసిస్టెంట్ పీఎఫ్ కమిషనర్ లోక్‌నాథ్ సాహు అధ్యక్షత వహించారు. పీఎఫ్ సభ్యులు, పెన్షనర్లు, వివిధ సంస్థల యజమానులు హాజరయ్యారు. వారికి వివిధ అంశాలపై సాహు అవగాహన కల్పించి సందేహాలు నివృత్తి చేశారు. జిల్లా నోడల్ అధికారి కేబీ మణి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఆర్ఐలో ఒత్తిడిలేని విద్యతో ఉత్తమ ఫలితాలు



ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న ఎన్ఆర్ఐ ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : నగరంలోని ఎన్ఆర్ఐ జూనియర్ కళాశాలలో ఒత్తిడిలేని క్రమశిక్షణతో కూడిన విద్యతో ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ఫలితాలు సాధ్యమయ్యాయని ఆ విద్యా సంస్థల సీఈఓ వి.తులసీరామ్ తెలిపారు. ఇంటర్మీడియట్ ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను గురువారం కళాశాలలో సన్మానించారు. ఈ సందర్భంగా తులసీరామ్ మాట్లాడుతూ తమ కళాశాలలో బట్టీ విధానంలో కాకుండా వ్యక్తిగత శ్రద్ధతో, విషయ పరిజ్ఞానం కలిగేలా బోధించడం ఉత్తమ ఫలితాలు సాధించగలిగామన్నారు. ఈ సందర్భంగా జూనియర్ ఎంపీసీలో 465 మార్కులు సాధించిన పి.ప్రీతమ్‌సాయి, బైపీసీలో 434 మార్కులు సాధించిన కె.హర్షసాయి ప్రణవ్, ఎంఈసీలో 485 మార్కులు సాధించిన ఎం.గాయత్రి, సీఈసీలో 475 మార్కులు సాధించిన జె.పద్మజలను వారి తల్లిదండ్రులను సన్మానించారు. సీనియర్ ఎంపీసీలో 987 మార్కులు సాధించిన ఎ.సాయి హితేష్, బైపీసీలో 986 మార్కులు సాధించిన యు.సాయి ధనుష్, ఎంఈసీలో 979 మార్కులు సాధించిన ఎన్.విష్ణుప్రియ, సీఈసీలో 955 మార్కులు సాధించిన మహ్మద్ సమీర్‌లను వారి తల్లిదండ్రులను ప్రత్యేకంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్స్ వి.కనకరత్నం, ఇ.మురళీకృష్ణ, కె.ప్రభాకరరావు, ఎస్.సత్యనారాయణ, సీహెచ్ శివకుమార్, ఏట కె.మల్లికార్జున రావు, ఎస్.రామాంజనేయులు, జె.నాగరాజు, వి.రాట్నాలు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సండే స్కూల్ టీచర్స్ ట్రైనింగ్



శిక్షణ పొందిన సండే స్కూల్ టీచర్లు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని ఆల్ సెయింట్స్ ఐసీఎం చర్చి కతేడ్రల్‌లో గత 24వ తేదీ నుంచి నిర్వహిస్తోన్న సండే స్కూల్ టీచర్స్ ట్రైనింగ్ గురువారం ముగిసింది. కృష్ణా, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల్లోని ఐసీఎం సంఘాల్లో పనిచేస్తోన్న సండే స్కూలు ఉపాధ్యాయులకు ఈ నాలుగు రోజులు వివిధ అంశాలపై ప్రత్యేక తర్ఫీదు ఇచ్చారు. బెంగళూరు చిల్డ్రన్ ఇవాంజెలికల్ ఫెలోషిప్‌కు చెందిన రాష్ట్ర డైరెక్టర్ రాజు, ఒంగోలు ప్రాంతీయ డైరెక్టర్ సీహెచ్ జరిమయ, ఏలూరు ప్రాంతీయ డైరెక్టర్ బి.డేవిడ్ రాజ్ కుమార్, కృపా డేవిడ్, దివ్య తేజ తర్ఫీదు ఇచ్చిన వారిలో ఉన్నారు. ఐసీఎం సంఘాల అగ్ర పీఠాధిపతులు బిషప్ జాన్ ఎస్‌డీ రాజు ముగింపు సభకు ముఖ్యఅతిథిగా హాజరై శిక్షణ ఇచ్చిన వారికి ఐసీఎం సంఘాల తరపున కృతజ్ఞతలు తెలిపారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులను అభినందిస్తూ వారు అనేక మందికి తర్ఫీదును ఇచ్చే వారిగా తయారు కావాలన్నారు. ఐసీఎం ఏలూరు అర్బన్ పాఠశాలల కరస్పాండెంట్ ఆర్.డేవిడ్, లింగపాలెం మండలం ఐసీఎం పాఠశాలల కరస్పాండెంట్ రోజీ జాన్, బిషప్ హౌజ్ ఆఫీస్ మేనేజర్ షేబా డేవిడ్ తదితరులు పాల్గొన్నారు. ఐసీఎం సండే స్కూల్స్ ప్రతినిధి డి.యోబు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

వైభవంగా అన్నకూటోత్సవం



స్వామివారికి పూజ చేస్తున్న భక్తులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావుపేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 22న ప్రారంభమైన స్వామి వారి 34వ వార్షిక వైశాఖ బ్రహ్మోత్సవాలు గురువారం ముగిశాయి. ఉదయం చతుస్థానార్చన, మూలమంత్ర హవనాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవ మహా పూర్ణాహుతి, ప్రధాన కుంభోద్వాసన పూజలు చేశారు. ఉదయం 10.30 గంటలకు స్వామికి తిరుప్పావడ సేవ (అన్నకూటోత్సవం) వైభవంగా నిర్వహించారు. 11.30 గంటలకు వసంతోత్సవం, చూర్ణోత్సవం, చక్రస్నానం అనంతరం తీర్థ ప్రసాద వితరణ చేశారు. స్వామి వారికి విశేష అలంకరణ చేశారు. సాయంత్రం ధ్వజావరోహణ, ద్వాదశ ప్రదక్షిణలు, ద్వాదశారాధన, శ్రీ పుష్పయాగ మహోత్సవం, శ్రీవారి శయనోత్సవం ఘనంగా నిర్వహించి మంగళశాసనాలు పలికి తీర్థప్రసాద వితరణ చేశారు. అర్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు విశేష పూజలు చేయగా ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ తోలేటి శ్రీనివాస్, ట్రస్టీలు, భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి నాగం సన్యాసిరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ఏలూరు (టూటౌన్): మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భజంత్రీ శ్రీనివాసరావు పిలుపు నిచ్చారు. స్థానిక సంఘ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపల్ కార్మికుల సమస్యలపై ఐక్యంగా పోరాడాలన్నారు. 137వ మేడే దినోత్సవం సందర్భంగా ఏలూరు కార్పొరేషన్ పరిధిలో 16 సర్కిల్ మస్టర్ పాయింట్ల వద్ద ఏఐటీయూసీ జెండాలు ఆవిష్కరించాలన్నారు. కార్మికుల పట్ల పాలకవర్గాలు అవలంభిస్తోన్న వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. 8 గంటల పనివిధానం కోసం నాడు కార్మికులు ప్రాణాలు అర్పించారని గుర్తు చేశారు. మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్మికులకు బీమా సౌకర్యం కల్పించాలని, ప్రమాదవశాత్తు మరణించిన కార్మికులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. సమావేశంలో యూనియన్ నగర అధ్యక్షుడు యలగాడ దుర్గారావు, కార్యనిర్వాహక అధ్యక్షుడు యలగాడ శివకుమార్, యూనియన్ ఉపాధ్యక్షుడు బంగారు దుర్గాప్రసాద్, కార్యదర్శి దొడ్డికర్ల నాగబాబు, కౌన్సిల్ సభ్యులు ముదరబోయిన భాస్కరరావు, మాడుగుల జగదీష్, గూడుపు దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ప్రభుత్వ సలహాదారు నాగార్జునరెడ్డి



కలెక్టర్ ప్రసన్న వెంకటేషన్‌ను సత్కరిస్తున్న నాగార్జునరెడ్డి

ఏలూరు(మెట్రో): పంచాయతీరాజ్ అండ్ గ్రామీణాభివృద్ధి (పీఆర్అండ్ఆర్‌డీ) రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు పోతిరెడ్డి నాగార్జునరెడ్డి ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలంలో గురువారం పర్యటించారు. సాయంత్రం ఏలూరు కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాపై తక్కువ సమయంలోనే పూర్తి అవగాహన చేసుకొని ప్రభుత్వం అమలు చేస్తోన్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా ముందుకు తీసుకెళుతున్నారని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను ఆయన అభినందించారు. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను శాలువాతో సత్కరించారు. అనంతరం ఉంగుటూరు మండల పర్యటనలో ఉపాధి కూలీలు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను వివరించారు. చేబ్రోలు జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలపై సంతృప్తి చెందనని తెలిపారు.

రిటైర్డ్ ఉద్యోగులకు పరామర్శ

ఏలూరు(మెట్రో): ఏపీజేఏసీ అమరావతి ఆధ్వర్యంలో గురువారం రిటైర్డ్ ఉద్యోగుల పరామర్శ కార్యక్రమం నిర్వహించారు. ఏపీజేఏసీ అమరావతి ఏలూరు జిల్లా చైర్మన్ కె.రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఏలూరు మండలంలోని రిటైర్డ్ ఉద్యోగులను వారి నివాసాలకు వెళ్లి నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా రమేష్‌కుమార్ మాట్లాడుతూ ఏపీజేఏసీ మలిదశ ఉద్యమ కార్యాచరణలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. రిటైర్డ్ ఉద్యోగులు ప్రశాంతంగా జీవించేలా వారి సమస్యలను తీర్చాలని కోరారు. ఏలూరు జేపీయర్ నగర్‌కు చెందిన రిటైర్డ్ టీచర్ సీహెచ్ సుందర రావు, విద్యానగర్‌లో నివాసం ఉంటున్న రిటైర్డ్ హెచ్ఎం ఎ.రామకృష్ణ పరామర్శించినట్టు చెప్పారు. కార్యక్రమంలో రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్, జిల్లా కార్యదర్శి ఎ. ప్రమోద్ కుమార్, పంచాయతీ రాజ్ ఇంజినీర్ జిల్లా కార్యదర్శి ఆర్.వీరబాబు, కోశాధికారి, ఆర్.శ్రీకాంత్, ఏపీజేఏసీ అమరావతి కోచైర్మన్ సీహెచ్ వర్మ, బట్టిన ఆంజనేయులు, కె.మహాలక్ష్మి, జి.ఇస్రాయేలు, తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	16	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	26	చిక్కుడు కాయలు	68
వంకాయలు (కాంతులు)	32	చామదుంపలు	56
వంకాయలు (తెలుపు)	36	ములక్కాడలు	05-07
బెండకాయలు	20	కంద	48
పచ్చిమిర్చి	26	బీట్‌రూట్	36
కాకర కాయలు	40-44	కీరా దోస	34
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	76
బీరకాయలు (పందిరి)	44	అల్లం	130
క్యాబేజీ	16	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	34	పాలకూర	10
దొండకాయలు	16	చుక్కకూర	10
బంగాళదుంపలు	22	తోటకూర	10
ఉల్లిపాయలు	18	గోంగూర	07
గోరుచిక్కుడు	38	పుదీనా	05
దోసకాయలు	18	బఠాణీ	--
ఆనబకాయ (1)	10-15	క్యాప్సికమ్	56
పొట్లకాయ(1)	15-20	చిలకడదుంప	24

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	35
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	34
ఏలూరు – బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	42
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	25

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.45	4820	27
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	32
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	29
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	26
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	25
ఏలూరు – బీహెచ్ఈఎల్	22.15	34820	27
ఏలూరు –బీహెచ్ఈఎల్	09.00	4794	34
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు –విశాఖపట్నం	22.00	4838	34
ఏలూరు – బెంగళూరు	14.00	4021	--
ఏలూరు –తిరుపతి	16.00	4830	30